# నమ్మకద్రోహి చంద్రబాబు

- బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ఆయన అనుయాయులకే..
- విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



35వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పార్టీ నాయకులు

**విజయనగరం:** తనను నమ్మిన వారిని మోసగించడంలో కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు పీహెచ్‌డీ పూర్తి చేశారని, ఆయన మాటకారి తనంతోనే 2024 ఎన్నికల్లో ప్రజలకు హమీలు గుప్పించి వాటిని అమలు చేయమంటే అన్నీ చేశామంటూ చెబుతున్నారని విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ధ్వజమెత్తారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ అంటూ ఎన్నికలకు ముందు ఊదరించిన చంద్రబాబు కేవలం ఆయన కుమారుడు లోకేష్‌కు, ఇతర అనుయాయులకు మాత్రమే భవిష్యత్ కల్పించి 5 కోట్ల మంది ఆంధ్రులను మోసగిస్తున్నారని మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు ఇదే తరహాలో మోసగించిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, ఏడాది వ్యవధిలోనే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు దూరం చేశారని అన్నారు. సూపర్ సిక్స్ హమీలు అమలు చేయకుండానే చేశామంటూ ప్రచారం చేసుకోవటం సిగ్గుచేటన్నారు. వాటిపై ప్రశ్నిస్తే కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పకుంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్యాయమైపోతారని, భావితరాలకు ఏం మిగలకుండా చేస్తారని చెప్పారు.



36వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో కరపత్రాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

### కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలు

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఒరవడితో ముందుకు వెళ్తున్నారని, పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన గౌరవం లభిస్తుందని కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ అభివృద్ధిలో కార్యకర్తలే వెన్నెముకలని, రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా పని చేసి కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయాలను ఎండగట్టాలన్నారు. గడిచిన ఐదేళ్లలో మనం చేసిన మంచిని చెప్పుకోలేకపోయామని, చంద్రబాబు ఇచ్చిన హమీలు అమలు చేయకుండానే చేశామంటూ బీరాలు పలుకుతుండటం విడ్డూరంగా ఉందని చెప్పారు.

### 36వ డివిజన్‌లో..

నగరంలోని 36 డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ బాలి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, విజయనగరం నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, వార్డు ఇన్‌చార్జి కుమ్మరిగుంట శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఇంటింటికి వెళ్లి చంద్రబాబు పాలనలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి బొద్దాన అప్పారావు, నగర పార్టీ ఉపాధ్యక్షుడు అవనాపు లక్ష్మణరావు, పార్టీ నాయకులు మొయిద ఆదిబాబు, మహిళా, యువజన , విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టాండింగ్ కమిటీ నియామకానికి దరఖాస్తులు



స్టాండింగ్ కమిటీ సభ్యులుగా కమిషనర్‌కు దరఖాస్తు చేస్తున్న కార్పొరేటర్ రాజేష్ తదితరులు

**విజయనగరం:** పురపాలక శాఖ జారీ చేసిన స్టాండింగ్ కమిటీ ఎన్నిక షెడ్యూల్‌ను అనుసరించి నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా బుధవారం చివరి రోజున ఐదుగురు సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య చాంబర్‌లో ఈ మేరకు తమ నామినేషన్ పత్రాలను కమిషనర్‌కు అందజేశారు. నామినేషన్లు సమర్పించిన వారిలో శెట్టి వీరవెంకట రాజేష్, అల్లు చాణక్య, ఎస్.నారాయణస్వామి, జీవీ.రంగారావు, రేగాన రూపాదేవి నామినేషన్ పత్రాలను అందజేశారు. వాటిని స్వీకరించిన కమిషనర్ పల్లి నల్లనయ్య, సంస్థ కార్యదర్శి హోదాలో సహాయ కమిషనర్ కిల్లన అప్పలరాజుతో కలిసి నామినేషన్ వేసిన సభ్యుల వివరాలతో కూడిన పత్రాన్ని నోటీసు బోర్డులో అతికించారు. నామినేషన్ దాఖలు ప్రక్రియలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## చెన్నై షాపింగ్ మాల్‌లో ఉద్యోగుల తొలగింపు



సీఐటీయూ ఆధ్వర్యంలో చెన్నై షాపింగ్ మాల్ ఎదుట ధర్నా చేసిన ఉద్యోగులు

- షాపు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా
- దిగి వచ్చిన యాజమాన్యం

**విజయనగరం గంటస్తంభం:** చెన్నై షాపింగ్ మాల్‌లో పని చేస్తున్న 100 మంది ఉద్యోగులను విధుల్లోకి రావొద్దంటూ నిలిపివేయడం అన్యాయమని సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు షాపింగ్ మాల్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే షాపింగ్ మాల్‌ను నమ్ముకొని చేరిన వారిని అర్ధంతరంగా ఆపేయడం దారుణమన్నారు. తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకొనే వరకు ఇక్కడే ఉంటామని షాపింగ్ మాల్ వద్ద ఆందోళన సాగించారు. ఉదయం 9.30 గంటల నుంచి షాప్‌లోకి ఎవ్వరిని వెళ్లనీయకుండా ఉద్యోగులు షాపు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. యాజమాన్యం దిగి వచ్చే వరకు కదిలేది లేదంటూ ఆందోళన కొనసాగించారు. దీంతో యాజమాన్యం తరపున ప్రతినిధి శేషు వచ్చి నాయకులను చర్చలకు పిలిచారు. ఏ నిర్ణయమైన కార్మికులు ముందే చర్చించాలని చెప్పడంతో అక్కడే నాయకులతో మాట్లాడారు. కార్మికుల డిమాండ్లకు అంగీకరించారు. డిమాండ్ల పరిష్కారానికి రాత పూర్వక హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని చెప్పారు. దీంతో యాజమాన్య ప్రతినిధి సమస్యలు అన్ని పరిష్కరిస్తామని, రాత పూర్వక హామీ ఇస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు, చెన్నై షాపింగ్ మాల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్

**విజయనగరం:** నగర వ్యాప్తంగా గుర్తించిన వీధి విక్రయదారులకు ఆగస్టు 10వ తేదీలోపు గుర్తింపు కార్డులను అందజేయాలని వెల్ఫేర్ కార్యదర్శులకు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి విక్రయదారుల సర్వేను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న విషయం తెలిసిందేనన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన సర్వే వివరాల ప్రకారం వీధి విక్రయదారులకు వెల్డింగ్ సర్టిఫికెట్లతో పాటు గుర్తింపు కార్డులను కూడా అందించాల్సి ఉందన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఆగస్టు 10వ తేదీలోపు రూ.150లు స్వీకరించి గుర్తింపు కార్డులను, వెండింగ్ సర్టిఫికెట్లను అందజేయాలని చెప్పారు. ఈ ప్రక్రియలో అలసత్వం వహించిన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో టీపీఆర్‌వో సింహాచలం పాల్గొన్నారు.

## రామతీర్థంలో సామూహిక కుంకుమార్చనలు రేపు

**నెల్లిమర్ల రూరల్:** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆగస్టు 1న సామూహిక కుంకుమార్చనలు జరిపించనున్నామని ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..

శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. మహాలక్ష్మి అమ్మవారికి సన్నిధిలో జరిగే మహా ఘట్టానికి భక్తులు పూజా సామగ్రితో పాటు పంచపాత్ర ఉద్ధరణ తీసుకురావాలన్నారు.

మహాలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు వైభవంగా జరిపిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## వసతిగృహాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం..



వసతిగృహ విద్యార్థులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**విజయనగరం టౌన్:** వసతిగృహాల్లో లోటుపాట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచన మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నాయకత్వంలో యువజన విభాగం, విద్యార్థి విభాగ నాయకుల సమక్షంలో బుధవారం 8వ డివిజన్ లంకవీధి, ఎమ్మార్ స్టేడియం పక్కన ఉన్నటువంటి వసతిగృహాలను సందర్శించారు. అక్కడ ఉన్న వసతి పని తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మహారాజా బాలుర వసతిగృహంలో ఉన్నటువంటి అసౌకర్యాలను తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలన్నింటిని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సమక్షంలో ఉంచి దానికి తగు వెసులుబాటు కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో ఉన్నటువంటి వసతిగృహాల్లో అసౌకర్యాలను, లోటుపాట్లను కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయి, యువజన విభాగం నాయకులు భార్గవ్, లంక సురేష్, పవన్, గౌతమ్, వర్ధన్, సాయి, హరీష్, ధనరాజ్, సాయి, పట్టణ విద్యార్థి విభాగం నాయకులు పొన్నాడ మణికంఠ, ప్రవీణ్, మనీ భగవాన్, వివేక్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ రక్షణ ఉద్యమ నేత గోకా



మాట్లాడుతున్న దళిత, గిరిజన ప్రజా సంఘాల ఉద్యమ నేతలు

**విజయనగరం టౌన్:** దళిత హక్కులే మానవ హక్కులని నినదించి రాజ్యాంగ రక్షణ కోసం పని చేసిన ఉద్యమ నేత గోకా రమేష్ అని దళిత, గిరిజన ప్రజా సంఘాల ఉద్యమనేతలు జెవి.ప్రభాకర్, ఆదాడ మోహన్‌రావు, బాబ్జీ పేర్కొన్నారు. స్థానిక అమర్‌భవన్‌లో ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన బుధవారం గోకా రమేష్ సంస్మరణ సభ నిర్వహించారు. గోకా రమేష్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ దళిత గిరిజనుల హక్కుల సాధనే ధ్యేయంగా రమేష్ పని చేశారని వివరించారు. బహుజనులు రాజ్యాధికార సాధన వైపు అడుగులు వేయాలని రాజ్యాంగ ద్రోహులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.ప్రభాకర్, రమణ, సోములు, బొత్స బుద్ధుడు, చిట్టిబాబు, రేగేటి సంతోష్, ఆర్జి శివప్రసాద్, సోము మురళి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు



ప్రాంగణ నియామక పత్రాలతో విద్యార్థులు, కళాశాల డైరెక్టర్

**విజయనగరం అర్బన్:** సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎంఎస్ఎస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం స్వీయ నిర్దేశక బృందాలు, బీఎస్సీ విద్యార్థుల కోసం ప్రొడక్షన్ ట్రైనీ పోస్టుల కింద ప్రాంగణ నియామకాలు బుధవారం నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి 300 మంది వరకు విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 50 మందిని ఎంఎస్ఎస్ ల్యాబ్స్ సంస్థ ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తెలిపారు. నియామక ప్రక్రియను ల్యాబ్స్ హెచ్‌ఆర్ టి.శివరామకృష్ణ, అడ్మిన్ శాఖ భాస్కర్, లక్ష్మీనరసింహదొర ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ పత్రాలను అందజేశారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

**విజయనగరం ఫోర్ట్:** పూల్‌బాగ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించే క్రమంలో ఆగస్టు 1న ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పీవీజీ నగర్, శిల్పారామం, ఆటో స్టాండ్, జిల్లా కోర్టు ఏరియాకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పీజీకాలేజీ, ఫీడర్ పరిధిలో వడ వీధి, ఎన్‌టీఆర్ జంక్షన్, పూల్‌బాగ్ కాలనీ అప్కో భవన్ ఏరియా , పీజీ కాలేజీ వరకు, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటి వరకు లంకాపట్నం, లక్ష్మీగణపతి కాలనీ, జగదాబ నగర్, సుబ్రహ్మణ్యస్వామి కోవెల ఏరియా యందు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు.

**పలు గ్రామాల్లో..**

**విజయనగరం ఫోర్ట్:** విజయనగరం మండలంలోని పలు గ్రామాలకు ఆగస్టు 1న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చెట్లు కొమ్మలను తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుప్పాడ, చిల్లపేట, జొన్నవలస, సారిక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

## ఇరువర్గాల కొట్లాట

**పూసపాటిరేగ :** మండలంలోని కొప్పెర్ల పంచాయతీ మత్సవానిపాలెంలో ఇరువర్గాలు కొట్లాటకు దిగడంతో పలువురుకి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మత్సవానిపాలెంకు చెందిన కోళ్ల స్వాతి పెళ్లి విషయంలో కోళ్ల, పళ్ల కుటుంబాల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో పళ్ల లక్ష్మణరావు, కోళ్ల అప్పలనర్సయ్య కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడంతో ఇరు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్ఐ ఐ.దుర్గాప్రసాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దుకాణాల అద్దెలు చెల్లించాలి



అద్దె షాపుల యజమానులతో మాట్లాడుతున్న సహాయ కమిషనర్

**విజయనగరం:** నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణాల అద్దె బకాయిలను చెల్లించాల్సిందేనని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. బుధవారం ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాలలో బకాయి ఉన్న యజమానులకు అద్దె చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం 157 దుకాణాలు ఉండగా వాటిలో 49 దుకాణదారులు అద్దెబకాయిలు ఉన్నట్టు గుర్తించారు. లక్ష రూపాయలు పైబడి బకాయి ఉన్న దుకాణాలు 15 వరకు ఉన్నట్టు గుర్తించారు. దీర్ఘకాల, మొండి బకాయిలు ఉన్న దుకాణాలకు సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ బృందంతో వెళ్లి బకాయి వసూళ్లకు పట్టుబట్టారు. దీంతో కొంతమంది గురువారంలోగా చెల్లిస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోపు బకాయిలు చెల్లించకుంటే దుకాణాలను మూసివేయడంతో పాటు తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మానవ అక్రమ రవాణాను అరికట్టాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామ్ శివారా

**విజయనగరం ఫోర్ట్:** మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎం.ఆర్.కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ శివారా అన్నారు. కళాశాలలో బుధవారం నేచర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తెలిపారు. 2024 నివేదిక ప్రకారం అక్రమ రవాణా బాధితుల్లో 61 శాతం మంది మహిళలేనని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి జి.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ పీవో చిన్నంనాయుడు, శర్మ, విష్ణు, ఎన్‌సీసీ అధికారి కళ్యాణ్ అశోక్, చైతన్య, బంగారుబాబు, కృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో

**భోగాపురం:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో గాయత్రీ ప్రజలకు సూచించారు. మండలంలో రామచంద్రపేట గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని, చెత్తను కాలువల్లో వేయకుండా ప్రత్యేకంగా బుట్టల్లో వేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి పుష్పలత పాల్గొన్నారు.

### సేవలకు సత్కారం



బదిలీ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ శివారెడ్డి తదితరులు

**భోగాపురం:** మండలంలోని అమటాం రావివలస పంచాయతీలో విధులు నిర్వర్తించి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందికి బుధవారం ఘన సత్కారం జరిగింది. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో సర్పంచ్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఏళ్ల కాలం నుంచి పంచాయతీలో విధులు నిర్వర్తించి అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. అంకిత భావంతో చేసిన సేవలే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

### పోలిపల్లిలో పొలం పిలుస్తోంది..



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**భోగాపురం:** మండలంలోని పోలిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏవో హైమావతి క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలని తద్వారా నేల సారవంతంగా ఉండడమే కాకుండా మెరుగైన దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకట్రావు, హైందవి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

### ఆగస్టు 16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**విజయనగరం టౌన్:** ఆచార్ ప్రబోధానంద యోగీశ్వర్లు దివ్యాశీస్సులతో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆగస్టు 16 నుంచి 20వ తేదీవరకూ నిర్వహించనున్నట్టు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు పేర్కొన్నారు. విజయనగరం సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గురజాడ కళాభారతిలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతీ రోజూ జ్ఞాన ప్రసంగాలు, నాటికలు, భగవద్గీత శ్లోకాల పోటీలు ఉంటాయన్నారు. ఆగస్టు 20న భారీ ఊరేగింపు ఉంటుందని, భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.